## కంకవనం పూజలతో సమ్మక్క జాతర షురూ


గద్దెలపై పూజలు చేస్తున్న అధికారులు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 20 : రామకృష్ణాపూర్ ఆర్కే-1ఏ గని కార్యాలయం వద్ద మేడారం నుంచి వచ్చిన కోయ పూజారులు మంగళవారం కంకవనం పూజలు చేసి జాతరను ప్రారంభించారు. మందమర్రి ఏరియా జీఎం మనోహర్, ఎస్వోటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై పూజలు చేశారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల నడుమ ఆర్కే-1ఏ గని నుంచి గద్దెల వరకు కంకవనాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ నెల 24వ తేదీ వరకు జాతర కొనసాగుతుందని జీఎం తెలిపారు. ఎస్వోటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఆర్కే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ గోవిందరావు, ఆర్కే-1ఏ గని మేనేజర్ జయంత్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఆంజనేయులు, జాతర ప్రధాన పూజారి దూలం కనకయ్య పాల్గొన్నారు.

## నేడు గూడెంలో సత్యదేవుని కల్యాణం


ముస్తాబవుతున్న కల్యాణవేదిక

దండేపల్లి, ఫిబ్రవరి20 : గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 18వ తేదీ నుంచి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఈ మేరకు బుధవారం సాయంత్రం గోధూళిక సుముహూర్తమున రమా సహిత సత్యనారాయణస్వామి కల్యాణాన్ని వైష్ణవ సంప్రదాయం ప్రకారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. వేలాదిగా భక్తులు తరలిరానుండగా, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గుట్టపై ఉన్న సత్యదేవుని ఆలయం పక్కన స్వామివారి కల్యాణ వేదికలను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్‌దీపాలు, పూల తోరణాలతో అలంకరించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు దంపతులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

# ప్రభుత్వ డాక్టర్.. 'ప్రైవేట్' విధులు



**మంచిర్యాల ఎంసీహెచ్‌లో పీపీ యూనిట్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న అరుణశ్రీ**

**సర్కారు జీతం తీసుకుంటూ.. 20 ఏళ్లుగా 'శ్రీ కిరణ్ ఆసుపత్రి'లో పని**

**కేసులున్నప్పుడు, మీటింగ్‌లకు మాత్రమే వస్తారంటున్న ఎంసీహెచ్ సిబ్బంది**

**బాలింత మృతితో వెలుగులోకి మరిన్ని విషయాలు**

మంచిర్యాల, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చెన్నూర్‌లోని శ్రీ కిరణ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో సోమవారం వైద్యం వికటించి మహారాష్ట్రలోని సిరోంచ తాలూక కారస్‌పల్లి గ్రామానికి చెందిన బాలింత రాపల్లి మంగ మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా.. మంగకి డెలివరీ చేసిన డాక్టర్ అరుణశ్రీ ప్రభుత్వ వైద్యురాలు కావడం గమనార్హం. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆసుపత్రి(ఎంసీహెచ్)లో పీపీ యూనిట్ ఇన్‌చార్జి వైద్యురాలు. ఏ ప్రభుత్వ వైద్యురాలైన డ్యూటీ సరిగ్గా చేయాలి. సాయంత్రం డ్యూటీ తర్వాత మాత్రమే ప్రైవేట్ ప్రాక్టిస్ నడుపుకోవచ్చు. కానీ డాక్టర్ అరుణశ్రీ మాత్రం మధ్యాహ్నం 12 గంటల నుంచే ప్రైవేట్ క్లినిక్‌లో అందుబాటులో ఉంటారు. మరి పీపీ యూనిట్‌లో డ్యూటీలో ఎప్పుడు ఉంటారంటే.. ఏమైనా కేస్‌లు ఉన్నప్పుడు, లేదా మీటింగ్‌లు ఉన్నప్పుడు మాత్రమే వచ్చి వెళ్తారట. వైద్యారోగ్య శాఖలో బాధ్యత గల వృత్తిలో పని చేయాల్సిన ఆమె వ్యవహారశైలి, ముందు నుంచి ఇంతేనని ఆమె పని చేసే ఆసుపత్రి వైద్యులు, సిబ్బందే స్వయంగా చెబుతున్నారు.

### 20 ఏళ్లుగా ఆ ఆసుపత్రిలోనే..

శ్రీ కిరణ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో 20 ఏండ్లుగా ఈ మేడం పని చేస్తున్నారు. ఈ ఆసుపత్రిలో ఆమె భాగస్వామిగా ఉన్నట్లు తెలిసింది. వైద్యారోగ్యశాఖలో మెడికల్ ఆఫీసర్‌గా ఉన్నప్పటి నుంచి ఈ మేడం కిరణ్ హాస్పిటల్‌లో పని చేస్తున్నారు. ఏది ఏమైనా.. 12 గంటలు కొట్టిందంటే చాలు ఇక్కడ వచ్చి వాలిపోతారు. ఇది ఏళ్లుగా జరుగుతున్న వ్యవహారమే అయినా, అరుణశ్రీని అడిగే నాథుడే లేకుండా పోయారని కొందరు మండిపడుతున్నారు. నిన్న వైద్యం వికటించి మృతి చెందిన బాలింతకు ఉదయం 6 గంటలకు ఈ డాక్టరే ఆపరేషన్ చేశారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో బాలింత పరిస్థితి విషమించినట్లు గుర్తించి హుటాహుటిన మంచిర్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దురదృష్టం కొద్ది బాలింత మృతి చెందడంతో అసలు ఆపరేషన్ చేసిన డాక్టర్ ఎవరనేది.. అన్న విషయంపై దృష్టి పడింది. ఆరా తీయగా ఆమె ప్రభుత్వ వైద్యురాలని, డ్యూటీకి సరిగా వెళ్లదని, ప్రైవేటు ఆసుపత్రిలోనే ఎక్కువ సమయం గడుపుతారని తెలిసింది. ఈ నేపథ్యంలోనే డాక్టర్ అరుణశ్రీ అని, ఆమె ప్రభుత్వ వైద్యురాలని తెలిసింది. నిబంధనల ప్రకారం డాక్టర్ అరుణశ్రీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎంసీహెచ్ విధుల్లో ఉండాలి. కానీ మేడం మాత్రం ఏదైనా కేసులు ఉన్నప్పుడు, మీటింగ్‌లు ఉన్నప్పుడు మాత్రమే వస్తారని ఆమె సహచర వైద్యులు, సిబ్బంది చెబుతుండడం కొసమెరుపు. ఈ విషయమై జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సుబ్బారాయుడుని వివరణ కోరగా.. ఏ డాక్టరైనా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండి తీరాలన్నారు. అరుణశ్రీ డ్యూటీ సరిగ్గా చేయదనే విషయం తమ దృష్టికి రాలేదన్నారు. అలాంటివేమైనా ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.


### గుట్టు చప్పుడు కాకుండా సెటిల్‌మెంట్..

వైద్యం వికటించి బాలింత మృతి చెందడంతో శ్రీ కిరణ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం ఈ విషయాన్ని ఎలాగైనా బయటకు రాకుండా ఉంచేందుకు తీవ్రంగా శ్రమించింది. ఈ క్రమంలోనే పోలీసు అధికారులకు ఆసుపత్రి నిర్వాహకులు భారీ మొత్తంలో డబ్బులు ముట్టజెప్పినట్లు సమాచారం. అందుకే పోలీసు యంత్రాంగం మొత్తం సోమ వారం చెన్నూర్ నుంచి మంచిర్యాల వరకు పహారా కాచింది. ఆసుపత్రి ముందు బాధితురాలు బంధువులు, ప్రజా సంఘాల నాయకులు ఆందోళనలు చేయకుండా బలగాలను మోహరించారు. సీఆర్‌పీఎఫ్ బలగాలను పెట్టి ఆసుపత్రి చుట్టు పక్కల ఎవరూ తిరగకుండా చూశారు. కానీ అప్పటికే విషయం బయటకు పొక్కడంతో బాధితురాలి బంధువులతో యాజమాన్యం సెటిల్‌మెంటు చేసుకున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఆ కుటుంబానికి రూ. ఆరున్నర లక్షలు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై ఆసుపత్రి నిర్వాహకుడు లక్ష్మణ్‌ను వివరణ కోరగా.. టూడీ ఎకో టెస్టు చేయకుండా ఆపరేషన్ చేయడంతో సమస్య వచ్చిందన్నారు. మంగకి అంతకుముందే గుండె సంబంధిత సమస్య ఉందని, ఆపరేషన్ అనంతరం ఆమె ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. మంచిర్యాల ఆసుపత్రికి తరలించినప్పటికీ మార్గంమధ్యలోనే ఆమె తుదిశ్వాస విడిచిందని చెప్పారు. పోలీసు శాఖకు, బాధితులకు డబ్బులు ఇచ్చిన విషయంపై మాట్లాడటానికి ఇష్టపడలేదు. మొత్తం వ్యవహారంపై డాక్టర్ అరుణశ్రీని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

# బోర్డు తీసేసి.. ప్లాట్లుగా మార్చేసి..

- ఆసిఫాబాద్ శివారులోని బీడీపీపీ స్థలం స్వాహా
- మూడెకరాల్లో ప్లాట్లు చేసి విక్రయాలు !
- ఆరు నెలల క్రితమే ప్రభుత్వ స్థలంగా బోర్డు.. అంతలోనే ఆక్రమించేసిన వ్యాపారులు
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు


గత ఆరునెలల క్రితం ప్రభుత్వ స్థలంగా గుర్తిస్తూ అధికారులు ఏర్పాటుచేసిన బోర్డు (ఫైల్)



ధరణిలో బీడీపీపీ స్థలంగా ఉన్న ప్రభుత్వ భూమి

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): ''ఇది ప్రభుత్వ స్థలం. దీనిని ఎవరైనా ఆక్రమించినచో చట్టరీత్యా చర్య తీసుకోబడును''. ఇది సుమారు ఆరు నెలల క్రితం ఆసిఫాబాద్ శివారులోని బీడీపీపీ భూమిలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు. ప్రస్తుతం అక్కడ బోర్డు తొలగిపోయింది. అదే స్థలంలో క్రమంగా ప్లాట్లు వెలుస్తున్నాయి. అధికారుల అండదండలు కలిగిన కొందరు కబ్జాదారులు సుమారు 3 ఎకరాల బీడీపీపీ స్థలాని ఆక్రమించి అమ్మకానికి పెడుతున్నట్లు తెలిసింది.

### ఆక్రమించి.. ప్లాట్లు చేసి..

ఆసిఫాబాద్ పట్టణాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాలు కబ్జాదారులకు వరంగా మారుతున్నాయి. ఏడాది కిందటి వరకూ ప్రభుత్వ స్థలాలుగా ఉన్న భూములు.. కబ్జాదారుల చెరలో చిక్కుకొని పాట్లుగా మారుతున్నాయి. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జాదారుల ఆగడాలకు హద్దులేకుండా పోతుందనడానికి ఇదే చక్కని ఉదాహరణ.. ఆసిఫాబాద్ శివారులోని సర్వే నంబరు 45లో 20 ఎకరాలున్నాయి. దీనిని బై నంబర్‌లుగా విభజించి.. 16 భాగాలుగా చేశారు. వీటిలో గతంలో కొందరికి 17 ఎకరాలకు పట్టాలివ్వగా, మిగిలిన 45/బీడీపీపీ/1, 45/బీడీపీపీ/2 సర్వే నంబర్‌లలో సుమారు 3 ఎకరాల భూమి.. ప్రభుత్వ ఆధీనంలో ఉంది. గతేడాది ఈ భూమిని ఆక్రమించి ప్లాట్లు చేయడానికి ప్రయత్నాలు జరగగా, రెవెన్యూ అధికారులు గుర్తించి.. ఇది ప్రభుత్వ స్థలమని.. ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని బోర్డును సైతం ఏర్పాటు చేశారు. అయితే, ఆరు నెలలైనా గడవకముందే ఆ బోర్డును తొలగించి మరీ ప్లాట్లు చేసి విక్రయిస్తున్నట్లు తెలుస్తున్నది.

### అన్యాక్రాంతమవుతున్నా అలసత్వం..

ఆసిఫాబాద్ శివారులోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఆసిఫాబాద్‌లోని భూములను కబ్జాచేయడమే వ్యాపారంగా మలుచుకున్నారు. రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకోవడం, ప్రభుత్వ భూములు ఎక్కడ ఖాళీగా ఉన్నాయనే సమాచారాన్ని తెలుసుకోవడం, మూడో కంటికి తెలియకుండా ప్లాట్లు వేసి విక్రయించడం పరిపాటిగా మారింది. 2017లో ప్రభుత్వ భూములపై సర్వే చేపట్టిన అధికారులు వాటి పరిరక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. అధికారులకు మామూళ్ల ఆశచూపి కోట్లాది రూపాయల విలువైన భూములను కాజేస్తున్నారన్న విమర్శలున్నాయి. సర్వే నం. 45లో ఉన్న మూడెకరాల బీడీపీపీ భూమి చుట్టూ.. పట్టా భూములున్నాయి. మధ్యలోనున్న ఈ మూడెకరాల ప్రభుత్వ స్థలంపై కన్నేసిన కబ్జాదారులు ప్లాట్లు చేసి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై అధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.


బోర్డు తీసేసిన స్థలం ఇదే


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో అనిల్‌కుమార్

## తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలి

**జడ్పీ సీఈవో అనిల్‌కుమార్**

కౌటాల, ఫిబ్రవరి 20 : రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలని జడ్పీ సీఈవో అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో తాగు నీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. వాటర్ ట్యాంకర్లు, పైప్‌లైన్లు, బోర్‌వెల్‌లు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి జీపీలో ఇంటి పన్ను వందశాతం వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్య, గ్రామాభివృద్ధి పనులు సక్రమంగా జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఏవో తోటాజీ, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఏఈ ఇనోశ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

సిర్పూర్(టీ), ఫిబ్రవరి 20 : ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని జడ్పీ సీఈవో అధికారులను అదేశించారు. మంగళవారం సిర్పూర్(టీ)లోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో సత్యనారాయణ, జడ్పీ సూపరింటెండెంట్‌లు తోటాజీ, వీణా, ఎంపీవో కృష్ణమూర్తి, ఈజీఎస్ ఏపీవో రామ్మోహన్ పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలు పరిష్కరించాలి

పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 20 : పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించాలని జడ్పీ సీఈవో అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో గంగాసింగ్, ఏవో తోటాజీ, మాజీ సర్పంచ్ జాజిమొగ్గ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు
- మంచిర్యాలలో జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న క్వాలిటీ కో ఆర్డినేటర్, జిల్లా సైన్స్ అధికారి

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 20 : జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ (ఎఫ్‌పీఎస్‌టీ), బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరమ్ (టీబీఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం ఆన్‌లైన్ విధానంలో జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ముఖ్య అతిథిగా క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాం, సీవీ రామన్ జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రామన్న, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయ ఫోరం ఉపాధ్యాయులు వనమాల పద్మ, సంగర్స్ వెంకటేశ్వర రావు, ఎఫ్‌పీఎస్‌టీ బాధ్యులు శ్రీమూర్తి, విద్యాసాగర్, రాజేశం పాల్గొన్నారు.

### విజేతలు వీరే...

జిల్లా స్థాయి పోటీల్లో పీ సుశాంత్ (బెల్లంపల్లి, జడ్పీహెచ్‌ఎస్ బజారు ఏరియా) ప్రథమ స్థానం, ఎస్ అశ్వక్ (జడ్పీహెచ్‌ఎస్ కలమడుగు - జన్నారం) ద్వితీయ స్థానం, ఎస్ జశ్వాంత్ ( జడ్పీహెచ్‌ఎస్ అచ్చులాపూర్) తృతీయ స్థానంలో నిలిచారు. వీరు రాష్ట్ర స్థాయి టాలెంట్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## 'గుడ్లు గుటాయ స్వాహా'పై సీరియస్

- కలెక్టర్ ఆదేశాలతో కాంట్రాక్టర్, సీడీపీవోలకు షోకాజ్ నోటీసులు
- రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ ఆదేశాలు

**● 'నమస్తే' ఎఫెక్ట్**

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 20 : 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ఈ నెల 15న 'గుడ్లు గుటాయస్వాహా', 19న 'చిన్న సైజు.. పెద్ద మోసం' పేరిట ప్రత్యేక కథనాలు ప్రచురితం కాగా, జిల్లా యంత్రాంగం సీరియస్ అయ్యింది. మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా సంక్షేమ అధికారి కొట్టె చిన్నయ్య గుడ్లు సరఫరా చేసే ఏజెన్సీ కాంట్రాక్టర్‌కు, వాటిని పర్యవేక్షించాల్సిన ఐసీడీఎస్ సీడీపీవోలకు షోకాజు నోటీసులు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లను సరఫరా చేసే రజిత పౌల్ట్రీఫాం ఏజెన్సీ నిర్వాహకుడు అగ్‌మార్క్ నిబంధనల మేరకు 45 నుంచి 52 గ్రాములున్న గుడ్లు సరఫరా చేయాలి. కానీ నాసిరకంగా, బరువు తక్కువ, పరిమాణం తక్కువ ఉన్న 30 గ్రాముల నుంచి 35 గ్రాముల బరువు గల గుడ్లను పంపిణీ చేస్తున్నాడు. అంతేగాకుండా సక్రమంగా సరఫరా చేయకపోవడంతో పిల్లలు, తల్లులు, బాలింతలకు పౌష్టికాహారం అందడంలేదని 'నమస్తే తెలంగాణ' ఆధారాలతో ప్రచురించిన విషయం విదితమే. ఈ విషయమై కలెక్టర్ ఆదేశాలతో పౌల్ట్రీ ఫాం నిర్వాహకుడికి షోకాజు నోటీసులు పంపించారు. అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, లక్షెట్టిపేట ప్రాజెక్టుల సీడీపీవోలకు సైతం షోకాజు నోటీసులు అందజేశారు. రెండు రోజుల్లో సీడీపీవోలు, గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్ వివరణ ఇవ్వాలని కోరారు. ఈ విషయమై జిల్లా సంక్షేమాధికారి కొట్టె చిన్నయ్యను సంప్రదించగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన నలుగురు సీడీపీవోలతో పాటు కాంట్రాక్టర్‌ను సైతం రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు.

## ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల కేంద్రం పరిశీలన


ఈవీఎంలు, వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్, ఫిబ్రవరి 20 : నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల అవగాహన కేంద్రాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్ మంగళవారం పరిశీలించారు. వచ్చేపార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే విధానాన్ని తెలిపేందుకు ఈ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.


అధ్యాపకుడు సురేశ్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

## దేశసేవలో భాగస్వాములవ్వాలి

**ప్రిన్సిపాళ్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌రావు**

దహెగాం, ఫిబ్రవరి 20 : విద్యార్థులు దేశసేవలో భాగస్వాములైనప్పుడే సార్థకత లభిస్తుందని ప్రిన్సిపాళ్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తిర్యాణి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు అన్నారు. దహెగాం ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం, క్రీడా సాంస్కృతికోత్సవాన్ని ప్రిన్సిపాల్ అమరేందర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ విద్య అంటే.. వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేదన్నారు. ప్రతి విద్యార్థికి ఇంటర్ కీలకమైనదని, ప్రణాళిక ప్రకారం చదివి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అనంతరం ఇటీవల బదిలీ అయిన అధ్యాపకుడు సురేశ్‌ను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం క్రీడల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఆసిఫాబాద్, కెరమెరి, ప్రిన్సిపాళ్లు రాందాస్, పరుశురాం, అధ్యాపకులు చంద్రశేఖర్, బాబాజీ, మహేందర్, గణపతి, దౌలత్, రాజన్న, మల్లేశ్ పాల్గొన్నారు.

# పాడి రైతుకు ప్రోత్సాహమేది?

- ఆసిఫాబాద్‌లోని బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌లో నిత్యం 3 వేల లీటర్ల పాల సేకరణ
- గతంలో 15 రోజులకోసారి ఖాతాల్లోకి డబ్బు
- ప్రస్తుతం 30 రోజులు గడిచినా జమ కాని వైనం
- ఈ-ల్యాబ్ పోర్టల్ సమస్య
- ఇబ్బందుల్లో అన్నదాతలు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20 : జిల్లా కేంద్రంలో ఉన్న బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్‌లో నిత్యం 3 వేల లీటర్ల వరకు పాల సేకరణ జరుగుతున్నది. ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన, కాగజ్‌నగర్, సిర్పూర్(టీ) మండలాలతో పాటు, మంచిర్యాల జిల్లా తాండూర్ మండలానికి చెందిన 480 మంది రైతుల నుంచి పాలను సేకరించి, ఇక్కడికి తరలిస్తారు. ప్యాకింగ్ కోసం లక్షెట్టిపేట్‌కు తరలిస్తారు. రైతులకు లీటర్‌కు వెన్న శాతాన్ని బట్టి రూ.40 నుంచి రూ.80 వరకు ధర నిర్ణయిస్తారు.

### 30 రోజులు గడిచినా..

పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు కేసీఆర్ సర్కారు అనేక చర్యలు చేపట్టింది. విజయ డెయిరీ సహకారంతో పాడి రైతుల నుంచి పాలు సేకరించి, వారిని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా పక్షం రోజులకోసారి పాల డబ్బులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసేవారు. కానీ, ప్రస్తుతం 30 రోజులు గడిచినా డబ్బులు పడకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రూ.30 లక్షలు పెండింగ్ ఉన్నట్లు సమాచారం.


ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ కేంద్రం

### రైతులకు అందని ప్రోత్సాహం..

రైతులు అమ్మకానికి తీసుకువచ్చిన పాల వెన్న శాతంతో ధర నిర్ణయించడంతో ఆ ధరతో పాటు ప్రతీ లీటర్‌కు రూ.4 ప్రోత్సాహం అందించేందుకు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. కానీ, అది అమలు కావడం లేదు. దీంతో రైతులు నిరుత్సాహంగా ఉన్నారు. ముద్ర పథకం ద్వారా గతంలో ప్రతి రైతుకూ రెండు బర్రెల కోసం రుణాలు ఇప్పించారు. 42 మంది రైతులు ఇందులో లబ్ధిపొందారు. మొదట్లో నిత్యం వెయ్యి లీటర్ల వరకు సేకరణ జరుగగా, ప్రస్తుతం 3 వేలకు పెరిగింది.

### పని చేయని పోర్టల్...

కేంద్రానికి పాలు అందజేసే రైతుల వివరాలను ఈ-ల్యాబ్ పోర్టల్‌లో నమోదు చేసి.. వారికి రావాల్సిన ప్రోత్సాహం అందిస్తారు. అయితే, గత కొద్ది రోజులుగా పోర్టల్ పని చేయకపోవడంతో రైతులకు నష్టం జరుగుతున్నది. ఈ-పోర్టల్‌లో రైతుల వివరాలు నమోదు చేస్తే రైతు కుటుంబంలో ఆడ బిడ్డ పెళ్లికి రూ.5 వేల సాయం అందించనున్నారు. అలాగే రైతు మృతిచెందితే వారి కుటుంబానికి దహన సంస్కార ఖర్చుల కోసం రూ.5 వేలు అందజేస్తారు. పోర్టల్‌లో వారి వివరాలు లేకపోతే రైతులకు ఏ రాయితీ అందే అవకాశం కూడా ఉండదు. ఈ-ల్యాబ్ పోర్టల్‌ను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.